క్లుప్తంగా

ప్రశాంతంగా టాలెంట్ టెస్ట్



మరికల్: నారాయణపేట జిల్లా స్థాయి టాలెంట్ టెస్టును ఆదివారం మరికల్ మండల కేంద్రంలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల విద్యార్థులకు ఏర్పాటు చేశారు. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో పూసల్ పహాడ్ టాలెంట్ టెస్టును నిర్వహించారు. మొత్తం 295 మంది విద్యార్థులు హాజరయ్యారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో బీరప్ప స్వామి పల్లకీసేవ



మరికల్: బీరప్పస్వామి బండారు ఉత్సవాలలో ఆదివారం స్వామివారికి పల్లకీ సేవ నిర్వహించారు. మండల కేంద్రంలోని పాత దేవాలయం నుంచి కొత్త దేవాలయం వరకు స్వామి విగ్రహాన్ని పల్లకీ ఊరేగించారు. భక్తులు ఒకరిపై ఒకరు బండారు చల్లుకుంటూ కొత్త దేవాలయానికి స్వామివారిని పల్లకీలో తీసుకొచ్చారు. వివిధ ప్రాంతాల నుంచి భక్తులు తరలివచ్చి స్వామివారిని దర్శించుకున్నారు. సోమవారం కొత్త ఆలయంలో బీరప్ప స్వామి బండారు ఉత్సవాలు నిర్వహిస్తున్నట్లు ఆలయ పూజారులు తెలిపారు.

అధికారమే లక్ష్యంగా పనిచేయాలి



మరికల్: అధికారమే లక్ష్యంగా బీజేపీ నాయకులు పనిచేయాలని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్ అన్నారు. ఆదివారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన కార్యకర్తల పదాధికారుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ సీఎం కేసీఆర్ ముఖ్యమంత్రి అయిన 9 ఏళ్లలో ప్రజలకు చేసింది ఏమీ లేదని విమర్శించారు. నిజాం తరహాలో బీఆర్ఎస్ పాలన ఉందని ఎద్దేవా చేశారు. బీఆర్ఎస్ ప్రభుత్వాన్ని ఇంటికి పంపించేందుకు యువకులు నడుం బిగించాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో భాస్కర్, తిరుపతిరెడ్డి పాల్గొన్నారు.

కార్మిక పోరాట ఫలితంగా వేతనాలు పెంపు

నారాయణపేట టౌన్: రాష్ట్ర ప్రభుత్వం మధ్యాహ్న భోజన కార్మికులకు వేతనాలు పెంచుతూ జీవో నెంబర్ 8ని విడుదల చేసిందని ఐఎఫ్‌టీయూ జిల్లా అధ్యక్షుడు కిరణ్ అన్నారు. ఆదివారం స్థానిక భగత్ సింగ్ భవనంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. మండల, డివిజన్, జిల్లా, రాష్ట్ర స్థాయిలో తీవ్రస్థాయిలో ఉద్యమాలు నిర్వహించారన్నారు. అనేక సంవత్సరాల పోరాట ఫలితంగా నేడు రాష్ట్ర ప్రభుత్వం వేతనాలు పెంచుతూ జీవోలను విడుదల చేసిందన్నారు. కార్యక్రమం ఐఎఫ్‌టీయూ ప్రధాన కార్యదర్శి బి.నరసింహ, సహాయ కార్యదర్శి నరసింహ, రామచందర్ తదితరులు పాల్గొన్నారు.

మన్యంకొండకు పాదయాత్ర



ధన్వాడ: మండలంలోని గున్ముక్ల గ్రామం నుంచి మన్యంకొండ వేంకటేశ్వరస్వామి దేవాలయం వరకు పాదయాత్రగా భక్తులు ఆదివారం బయలు దేరారు. మన్యంకొండ జాతర ఉత్సవాలలో భాగంగా గ్రామం నుంచి పెద్ద ఎత్తున్న పాదయత్రగా వెళ్లారు. పాదయాత్రలో అశోక్‌గౌడ్, నాగరాజుగౌడ్, తిమ్మయ్య, ఓబులేసుగౌడ్, వెంకటప్ప, కథలప్ప తదితరులు పాల్గొన్నారు.

జాతీయ స్థాయిలో గిరిజన విద్యార్థిని ప్రతిభ

నారాయణపేట రూరల్: మండలంలోని పిల్లిగుండ్లతండాకు చెందిన బుగ్గమ్మ, కిషన్ నాయక్ రెండో కుమార్తె సావిత్ర అదిలాబాద్ స్పోర్ట్స్ స్కూల్‌లో 9వ తరగతి చదువుతోంది. కేరళ రాష్ట్రంలో ఈ నెల 3 నుంచి జరిగిన ఖేలో ఇండియా ఉమెన్స్ జోడో నేషనల్ లీగ్ అండ్ ర్యాకింగ్ టోర్నమెంట్‌లో పాల్గొన్నది. సీనియర్స్ విభాగంలో మూడవ స్థానంలో, జూనియర్స్ విభాగంలో మొదటి బహుమతి సాధించింది. గిరిజన విద్యార్థి ప్రతిభ కనబరచడంతో పలువురు శుభాకాంక్షలు తెలిపారు.

ఘనంగా బ్రహ్మోత్సవాలు



లక్ష్మీ నరసింహస్వామి కల్యాణోత్సవం



ఆలయంలో పూజలు నిర్వహిస్తున్న భక్తులు

నారాయణపేట రూరల్: మండలంలోని ఎక్లాస్‌పూర్‌లో ఆదివారం శ్రీనివాస కల్యాణం నిర్వహించారు. తిమ్మప్పస్వామి జాతర ఉత్సవాల్లో భాగంగా గుట్ట కింద భాగంలో ప్రత్యేక మండపం ఏర్పాటు చేసి భక్తుల సమక్షంలో కల్యాణ తంతును కన్నుల పండువగా జరిపించారు.అంతకుముందు కొండ పైన స్వామివారికి సుప్రభాతసేవ, కుంకుమార్చన, విశేష అలంకరణ, పుష్పలంకరణ తదితర పూజా కార్యక్రమాలు చేపట్టారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో భక్తులు పాల్గొన్నారు.

వైభవంగా తిమ్మప్పస్వామి రథోత్సవం

మండలంలోని ఎక్లాస్‌పూర్‌తో ఆదివారం రాత్రి తిమ్మప్పస్వామి ఉత్సవమూర్తికి ప్రత్యేక పూజలు చేశారు. ఆదివారం అర్ధరాత్రి దాటిన తర్వాత భక్తుల కోలాహలం మధ్య రథోత్సవం వైభవంగా నిర్వహించారు. అలంకరించిన రథంలో స్వామివారిని ప్రతిష్ఠించారు. రథాన్ని లాగేందుకు భక్తులు పోటీపడ్డారు.

ఘనంగా లక్ష్మీనరసింహస్వామి బ్రహ్మోత్సవాలు

మరికల్: మండలంలోని ఎంక్లాస్‌పూర్‌లో తొమ్మిది రోజు పాటు నిర్వహిస్తున్న లక్ష్మీ నరసింహస్వామి బ్రహ్మోత్సవాలలో భాగంగా 8వ రోజు ఆదివారం స్వామివారికి ఉదయం పంచామృత అభిషేకం, పార్వతి పరమేశ్వరుల కల్యాణం నిర్వహించారు. భక్తులు స్వామి వారికి దాసంగాలు సమర్పించారు. భక్తులకు అన్నదానం చేశారు. సాయంత్రం లక్ష్మీ నరసింహస్వామి పార్వతి పరమేశ్వరుల ఉత్సవ విగ్రహాలను ఊరేగించారు. ఇందులో పూజారి శివ రామ ప్రసాద్‌శర్మ, మాణిక్య ప్రభుశర్మ నరసింహ స్వామి, ఆశప్ప, మోహన్, కృష్ణయ్య, రాములమ్మ, అంజనేయులు సిద్దమ్మ సుజాత పాల్గొన్నారు.

పౌర్ణమి ప్రత్యేక పూజలు

నర్వ: పౌర్ణమిని పురస్కరించుకొని మండలంలోని పెద్దకడ్మూర్ వేంకటేశ్వరస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా అర్చకులు ప్రవీణ్‌కుమార్ స్వామి వారికి తులసి మాలతో అర్చన, పంచామృతాభిషేకం, మహా మంగళహారతి ఇచ్చారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు అందించారు. కార్యక్రమంలో నిర్వాహకులు మాసన్న, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

ఆంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ఠాపన

మాగనూర్: మండలంలోని అమ్మపల్లిలో ఆంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ఠాపన కనులపండువగా జరిగింది. గ్రామంలో ఆదివారం ఉదయం నుంచి హోమం, బొడ్రాయి, నవగ్రహాలు, గణపతి, నాగుల విగ్రహాల ప్రతిష్ఠాపనతో పాటు ఆంజనేయ స్వామి విగ్రహం ప్రతిష్ఠించారు. అనంతరం గ్రామంలో యువకులకు నిర్వహించిన కబడ్డీ పోటీలు అందరిని అలరించాయి. కాంగ్రెస్ నాయకులు ప్రశాంత్‌కుమార్‌రెడ్డితో పాటుగా పలువురు ప్రముఖులు ఆలయాన్ని దర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో సర్పంచ్ పద్మమ్మ,



పెద్దకడ్మూర్‌లో

ఉపసర్పంచ్ పద్మమ్మ, గ్రామపెద్దలు మైపాల్‌రెడ్డి, నర్సిములు, కతలప్ప, వెంకటేష్, తిమ్మప్ప, రామకృష్ణ, హన్మంతు, నరేష్, శివ తదితరులు పాల్గొన్నారు.

చౌడేశ్వరి మాత ఆలయంలో..

నారాయణపేట టౌన్: జిల్లా కేంద్రంలో పౌర్ణమి సందర్భంగా బాపునగర్ తోగట వీరక్షత్రీయ సంఘం ఆధ్వర్యంలో చౌడేశ్వరి మాత ఆలయంలో పంచామృతాభిషేకం, పుష్పాభిషేకం, పసుపు, కుంకుమార్చనలు చేశారు. అనంతరం మధ్యాహ్న మహామంగళ హారతి చేపట్టారు. భక్తులకు అన్నదానం చేశారు. అలాగే సాయి విజయ్ కాలనీలో సాయి హనుమాన్ మందిరంలో బాబాకు క్షీరాభిషేకం, పుష్పాభిషేకం చేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. మధ్యాహ్న మంగ మంగళ హారతినిచ్చి భక్తులకు అన్నదానం చేశారు. ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.



ఎక్లాస్‌పూర్ తిమ్మప్పస్వామి రథోత్సవం



బాపునగర్‌లో చౌడేశ్వరి మాతను దర్శించుకుంటున్న భక్తులు

ట్యాంకుల శుభ్రం చేపట్టేదెప్పుడో..



పట్టణంలోని పళ్లలో ట్యాంకు చుట్టూ చేరిన నాచు

నారాయణపేట టౌన్: పట్టణంలో తాగునీటి ట్యాంకులను శుభ్రం చేయడంలో సిబ్బంది, అధికారుల నిర్లక్ష్యంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. పట్టణంలో భగీరథ పైపులైన్లు ఎక్కడికక్కడ మరుగునీటిలో కలసిపోయాయి. నెలల తరపడి ట్యాంకులను శుభ్రం చేయకుండా కలుషిత నీటిని సరఫరా చేస్తున్నారని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పళ్ల, ఎస్సీ కాలనీ, శ్రీనగర్ కాలనీ, ధూల్‌పేట, భివండి కాలనీతో పలు కాలనీలో ట్యాంకులను ఆరు నెలలైనా శుభ్రం చేయలేదని కాలనీ వాసులు వాపోతున్నారు. కాలనీలో కుళాయిలకు నీరు సరఫరా కాకపోతే తాగేందుకు ఇతర అవసరాలకు ట్యాంకు నీటినే వినియోగిస్తున్నారు.

పాకర పట్టిన పట్టించుకోరా..

పట్టణంలోని పలు వార్డుల్లో నిర్మించిన మినీ వాటర్ ట్యాంకుల వద్ద పరిసరాలు అపరిశుభ్రంగా ఉన్నప్పటికీ దానిపై అధికారులు దృష్టి సారించట్లేదు. ట్యాంకు చుట్టూ నాచు, బూజు పడుతున్న అధికారులు కన్నెత్తి చూడడం లేదని ప్రజలు వాపోయారు. ఇకనైనా ట్యాంకులను పరిశుభ్రం చేసేలా అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

శుభ్రం చేయాలి

ట్యాంకులను తప్పనిసరిగా వారానికి ఒక్కసారి శుభ్రం చేసి వాటి చుట్టూ పరిశుభ్రం ఉండేలా తగిన చర్యలు తీసుకోవాలి. ట్యాంకు పైపులు లీకేజీలు ఉంటే వెంటనే సరిచేసి సమస్య పరిష్కరించాలి. తప్పనిసరిగా మున్సిపల్ అధికారులు తాగు నీటి ఎద్దడిని తొలగించాల.

– శ్రీనివాస్, నారాయణపేట


చర్యలు తీసుకుంటాం

పట్టణంలో ట్యాంకులను శుభ్రం చేస్తున్నారు. ఆయా వార్డుల్లో ఉన్న మినీ టాంక్యులను శుభ్రం చేసేలా చర్యలు తీసుకుంటాం. ట్యాంకు చుట్టు పరిశుభ్రం చేపట్టి ఎలాంటి సమస్య రాకుండా పరిష్కరిస్తాం.

– సునీత, మున్సిపల్ కమిషనర్, నారాయణపేట



శ్రీనగర్ కాలనీలో..



పట్టణంలో అపరిశుభ్రంగా ట్యాంకు



దళితవాడలో మురుగులో బోరుపైపు

క్రీడా ప్రాంగణాల ఏర్పాటులో అలసత్వం

అమరచింత: మున్సిపాలిటీలోని ప్రతి వార్డులో తెలంగాణ క్రీడా మైదానాలు ఏర్పాటు చేయాలని రాష్ట్ర ప్రభుత్వం ఆదేశించడంతో పట్టణంలోని ఆయా వార్డుల్లో క్రీడా ప్రాంగణ పనులు మొదలయ్యాయి. పట్టణంలోని 1, 2, 3, 4, 5, 6, 7, 8 వార్డుల్లో క్రీడా ప్రాంగణాల ఏర్పాటుకు మున్సిపల్ పాలక వర్గం, అధికారులు శ్రీకారం చుట్టారు. జెడ్పీ ఉన్నత పాఠశాల మైదానంలో లాంగ్ జంప్ కోర్టు, బాలికల ఉన్నత పాఠశాల, ఉర్దూ మీడియం పాఠశాలలో రింగ్‌బాల్ కోర్టులను ఏర్పాటు చేశారు. 2వ వార్డులోని ఎస్సీ వసతి గృహంలో వాలీబాల్, కబడ్డీ కోర్టులను నిర్మించడానికి స్థలాన్ని చదును చేసి క్రీడా ప్రాంగణాల సూచిక బోర్డులనుయేర్పాటు చేశారు. కోర్టుల ఏర్పాటు వ్యవహారంలో కేవలం మొర్రం పోసి దానిని చదును చేయకుండా వదిలి వేయడంతో మొర్రం మట్టిలోని రాళ్ల కాళ్లకు కుచ్చుకుంటున్నాయని విద్యార్థులు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ఒక్కో క్రీడా ప్రాంగణానికి రూ.లక్ష వరకు ఖర్చు చేస్తు సౌకర్యాలను సమకూర్చాలని ఆదేశించింది. కానీ ఆయా వార్డుల్లో స్థల కొరత కారణంగా వాలీబాల్, కబడ్డీ, రింగ్‌బాల్ కోర్టులను ఏర్పాటు చేసి అధికారులు చేతులు దులుపుకున్నారు. అసంపూర్తిగా క్రీడా ప్రాంగణాలు ఉండటంతో వాటిని విద్యార్థులు, యువకులు వినియోగించుకోలేని పరిస్థితి ఏర్పడింది. కొన్ని చోట్ల క్రీడా ప్రాంగణాల సూచిక బోర్డులను సైతం మరిచారు. అధికారులు స్పందించి క్రీడా ప్రాంగణాల ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.



త్వరలోనే పూర్తి చేస్తాం

పట్టణంలోని పది వార్డుల్లో క్రీడాప్రాంగణాల ఏర్పాటుకు ప్రణాళిక సిద్ధం చేశాం. ప్రస్తుతం స్థలాలు ఉన్న చోట కొన్నింటికి సంబంధించిన ఆట మైదానాలు ఏర్పాటు చేశాం. ఇప్పటి వరకు ఆయా వార్డుల్లో అక్కడి స్థల పరిస్థితులతో రూ.10 వేల నుంచి రూ.50 వేల వరకు క్రీడా ప్రాంగణాల కోసం ఖర్చు చేశాం.



– మహమ్మద్ ఖాజా, మున్సిపల్ కమిషనర్

విద్యార్థుల నైపుణ్యాన్ని వెలికితీసేందుకే ..



నర్వ ఉన్నత పాఠశాలలో పరీక్షా పత్రాలను విడుదల చేస్తున్న ఎస్ఐ, నిర్వాహకులు

నర్వ: విద్యార్థుల్లో నైపుణ్యాన్ని వెలికితీసేందుకే టాలెంట్ టెస్టులు ఉపయోగపడతాయని ఎస్ఐ విక్రమ్ అన్నారు. ఆదివారం మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన పూసల్‌పహాడ్ టాలెంట్ టెస్టును ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా నిర్వాహకులతో కలిసి పరీక్షా పత్రాలను విడుదల చేసి విద్యార్థులకు అందించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. పదో తరగతిలో వార్షిక పరీక్షల కంటే ముందే జిల్లాలోని అన్ని మండలాల్లో ప్రతి ఏడాది ఈ టాలెంట్ టెస్టులు ఏర్పాటు చేస్తున్న నిర్వాహకులను ఆయన అభినందించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు డా.శంకర్, ఉపాధ్యాయులు వెంకటేష్, మన్మథ్‌కుమార్, పరీక్షల నిర్వాహణ అధికారులుగా కరుణాకర్, మహేందర్ వ్యవహరించారు.

కోస్గి: గ్రామీణ ప్రాంత విద్యార్థుల్లో ప్రతిభను గుర్తించి వారిని ప్రోత్సహించేందుకు ఆదివారం నిర్వహించిన పూసల్ పహాడ్ టాలెంట్ టెస్టుకు అనుహ్య స్పందన లభించింది. ప్రతియేటా 10వ తరగతి విద్యార్థులకు జిల్లాస్థాయిలో నిర్వహించే ఈ పరీక్షకు మండలంలోని పలు పాఠశాలల విద్యార్థులు హాజరయ్యారు. జిల్లా పరిధిలో జరిగిన ఈ పరీక్షల్లో భాగంగా స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాల కేంద్రంగా ఈ ప్రతిభ పరీక్ష నిర్వహించగా పలు ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలకు చెందిన 250 మంది విద్యార్థులు హాజరైనట్లు నిర్వాహకులు తెలిపారు. స్థానిక పరీక్షలను తపస్ జిల్లా గౌరవ అధ్యక్షుడు మల్లికార్జున్ పర్యవేక్షించగా రామకృష్ణారెడ్డి, అంజిలయ్య, పరంధాములు, తుల్జారాం, నాగరాజు, రవితేజ పాల్గొన్నారు. అంతకు ముందు స్థానిక ప్రభుత్వాస్పత్రి వైద్యుడు అనుదీప్ పరీక్ష పేపర్‌ను విడుదల చేశారు.

క్రీడాకారులు ఉన్నత స్థాయికి ఎదగాలి

మాగనూర్: క్రీడాకారులకు ఉన్నత స్థాయికి ఎదగాలని వీజేఆర్ ఫౌండేషన్ అధినేత వర్కటం జగన్నాథ్‌రెడ్డి అన్నారు. మండల కేంద్రంలో వీజేఆర్ యూత్ ఆధ్వర్యంలో నిర్వహించిన జిల్లాస్థాయి క్రికెట్ టోర్నమెంట్ ఫైనల్ మ్యాచ్ ఆదివారం మక్తల్ జట్టు, కొత్తపల్లి జట్టు మధ్య జరగగా మక్తల్ జట్టు విజేతగా నిలిచింది. విజేతలకు రూ.25 వేల నగదు, ట్రోఫి ప్రదానం చేశారు. ఆయన మాట్లాడుతూ.. జాతీయ స్థాయిలో వివిధ క్రీడల్లో రాణిస్తున్న వారందరూ గ్రామీణ స్థాయి నుంచి వచ్చిన వారేనని తెలిపారు. క్రీడాకారులకు ఎల్లప్పుడూ తన సహకారం ఉంటుందని అన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ శ్యామలమ్మ, వీజేఆర్ వలంటీర్లు సగరం రమేష్, యూత్ సభ్యులు పల్లె మారెప్ప, అశోక్‌గౌడ్, వాకిటి వాబయ్య, కృష్ణయ్య, నరేష్, రవి, వంశీ, రీత్ తదితరులు పాల్గొన్నారు.



విజేతలకు చెక్కు, ట్రోఫి అందజేస్తున్న జగన్నాథ్‌రెడ్డి

జిల్లా మహాసభల వాల్ పోస్టర్ విడుదల



నర్వలో వాల్‌పోస్టర్లను విడుదల చేస్తున్న జర్నలిస్టు నాయకులు

మక్తల్: ప్రభుత్వం వెంటనే స్పందించి జర్నలిస్టుల సమస్యను పరిష్కరించాలని టీయూడబ్ల్యూజే 143 నారాయణపేట జిల్లా అధ్యక్షుడు ఆనంద్‌కుమార్ అన్నారు. ఈనెల 7వ తేదీన నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలో నిర్వహించే టీయూడబ్ల్యూజే 143 మహాసభల వాల్ పోస్టర్ విడుదల చేశారు. కార్యక్రమంలో నేషనల్ కౌన్సిల్ సభ్యుడు వారధి నవీన్‌కుమార్, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు రఘు, జిల్లా కోశాధికారి బ్రహ్మానందరాజు, తెంజు జిల్లా అధ్యక్షుడు రాజశేఖర్, జిల్లా కార్యవర్గ సభ్యుడు ప్రతాప్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఊట్కూరు: టీయూడబ్ల్యూజే 143 ఆధ్వర్యంలో ఈ నెల 7న నాగర్‌కర్నూల్ పట్టణంలో జరిగే మహాసభలను విజయవంతం చేయాలని జిల్లా అధ్యక్షుడు ఆనంద్‌గౌడ్ కోరారు. ఆదివారం ఊట్కూరులో నిర్వహించే టీయూడబ్ల్యూజే 143 సమావేశంలో మండల అధ్యక్షుడిగా కాజికలీక్, జిల్లా కోశాధికారి బ్రహ్మనందగౌడ్, జిల్లా కార్యవర్గ సభ్యులు ప్రతాప్ రెడ్డిలను ఏకగ్రీవగం ఎన్నుకున్నారు. కార్యక్రమంలో జాతీయ కార్యవర్గ సభ్యుడు నవీన్‌కుమార్, రఘు, రాజశేఖర్, అశోక్‌కుమార్, ఆశాకిరణ్, శ్రీనివాస్, జాకీర్, వసీం తదితరులు పాల్గొన్నారు.

నర్వ: జర్నలిస్టుల సంక్షేమానికి టీయూడబ్ల్యూజే 143 ఎల్లప్పుడు కృషి చేస్తుందని జిల్లా నాయకులు ఆనంద్‌కుమార్‌గౌడ్ అన్నారు. ఆదివారం నర్వలో సభ్యత్వ నమోదు, చలో నాగర్‌కర్నూల్ పోస్టర్లను ఆవిష్కరించారు. కార్యక్రమంలో వారధి నవీన్, రఘు, రాజశేఖర్, బాల్‌రాజు, అంజనేయులు, సుదర్శన్‌గౌడ్, పాండు, రఘు, వెంకట్‌రెడ్డి, చెన్నరాయుడు, బాలుచారి, గణేష్ తదితరులు పాల్గొన్నారు.

కేంద్ర బడ్జెట్‌తో ఒరిగిందేమీ లేదు

నారాయణపేట టౌన్: కేంద్ర బడ్జెట్‌తో ఒరిగిందేమీ లేదని సీపీఐ ఎంఎల్ ప్రజాపంథా రాష్ట్ర కార్యదర్శి పోటు రంగారావు అన్నారు. ఆదివారం జిల్లా కేంద్రంలో భగత్ సింగ్ భవన్, సీపీఐ ఎంఎల్ ప్రజాపంథా పార్టీ జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాజీ ఎమ్మెల్యే గుమ్మడి నర్సయ్య, రాష్ట్ర నాయకులు రమ, కృష్ణ, హన్మేష్, జిల్లా కార్యదర్శి బి. రాములుతో కలిసి ఆయన మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వ బడ్జెట్ బడాబాబులకు అనుకూలంగా ఉందన్నారు. ఉపాధి సంగతి ఊసే లేదన్నారు. నారాయణపేట-కొడంగల్ లిఫ్ట్ ఇరిగేషన్‌ను వెంటనే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చేపట్టాల్సిన అవసరం ఉందని, దీనికి కేంద్రం నిధులు కేటాయించాలన్నారు. రాష్ట్రం కూడా నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు. నారాయణపేట పట్టణంలో 22 ఏళ్ల కిందట ప్రభుత్వం నిరుపేదలకు ఒక్కొక్కరికి 100 గజాల స్థలాన్ని 67 సర్వే నెంబర్ వల్లంపల్లి శివారులో 350 మందికి, 48 సర్వే నెంబర్లలో 650 మందికి ఇండ్ల పట్టాలను అందించారని, గత ప్రభుత్వం కేటాయించిన, ఇళ్ల స్థలాలను లాక్కోవడం ఎంతవరకు సమంజసం అన్నారు. కార్యక్రమంలో పీవైఎల్ రాష్ట్ర అధ్యక్షుడు కాశీనాథ్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న పోటు రంగారావు

ఏషియన్ షూటింగ్ బాల్ పోటీల్లో ప్రతిభ

మక్తల్: ప్రథమ ఏషియన్ షూటింగ్ బాల్ చాంపియన్ షిప్ పోటీల్లో పురుషుల విభాగంలో మక్తల్‌కు చెందిన తిలక్‌సింగ్ రాజ్‌పురోహిత్, ఇందరాసింగ్ తృతీయ స్థానం సాధించారని షూటింగ్‌బాల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు గోపాలం ఆదివారం మక్తల్‌లో విలేకర్లకు తెలిపారు. ఈనెల 1 నుంచి 2వ తేదీ వరకు ఉత్తరప్రదేశ్ రాష్ట్రం ఘజియాబాద్ పట్టణంలో 22 దేశాలు పాల్గొన్న క్రీడల్లో మక్తల్‌కు తృతీయ స్థానం దక్కిందన్నారు. ఏషియన్ అధ్యక్షుడు చౌదరి ధర్మ, పాలిసింగ్, ఇండియా అధ్యక్షుడు, ఎంపీ డాక్టర్ అకిల్ అగ్రవాల్ ట్రోఫిని అందించారని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు గోపాల్‌రెడ్డి, గౌరవ అధ్యక్షుడు తాన్‌సింగ్, క్రీడసంఘాల అధ్యక్షుడు నర్సింహాగౌడ్ తదితరులు పాల్గొన్నారు.



క్రీడాకారులను అభినందిస్తున్న సభ్యులు

ఉచిత వైద్య శిబిరం విజయవంతం

నారాయణపేట టౌన్: జిల్లా కేంద్రంలోని గీత ఆస్పత్రిలో శస్త్ర చికిత్స వైద్య నిపుణులు గీత విశ్వనాథ్ ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత మూత్రపిండాల వైద్య శిబిరం నిర్వహించారు. వైద్య నిపుణులు వాఖియా సుల్తానా 90 మందికి పరీక్షలు చేశారు. మూత్రపిండాల ఆరోగ్యానికి సంబంధించిన పలు సలహాలు, సూచనలు ఇచ్చారు. కార్యక్రమంలో ఆస్పత్రి సిబ్బంది పాల్గొన్నారు.